## క్లుప్తంగా

### సంతానలక్ష్మిగా మావుళ్లమ్మ దర్శనం



భీమవరం(ప్రకాశం చౌక్) : శ్రీమావుళ్లమ్మ ఆలయ 61 వార్షిక మహోత్సవాలో సోమవారం సంతానలక్ష్మీదేవి అలంకరణలో మావుళ్లమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద రాత్రి 8 గంటలకు మావుళ్లమ్మ నాట్యమండలి ప్రదర్శించిన కురుక్షేత్రం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో అర్చకులు, ఉత్సవాల నిర్వహకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆడపిల్ల చదువు అవనికి వెలుగు



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు, ఐసీడీఎస్ సిబ్బంది

కాళ్ల: జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.నిర్మల ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థినులచే సైకిల్ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఆడపిల్ల చదువు అవనికి వెలుగని, అన్ని రంగాల్లోనూ రాణించి, తన కాళ్లపై తాన నిలబడటానికి దోహదపడుతుందని తెలిపారు. ఆడపిల్లను గర్భంలో ఉండగానే లింగ నిర్ధారణ చేసి భ్రూణ హత్యలు చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో వైవీవీ ఝాన్సీ, ఎం.బేబీ, కె.రత్నకుమారి, సీహెచ్.రాజమణి, అనూషబేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గ్లాసులు, కంచాల పంపిణీ



కంచాలు పంపిణీ చేస్తున్న అధికారులు

భీమవరం: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ రీజనల్ మేనేజర్లు వెంకన్నబాబు, రామకృష్ణ అన్నారు. సోమవారం శ్రీవిజ్ఞానవేదిక, మునిసిపాల్టీ ఆధ్వర్యంలో లూథరన్ హైస్కూల్లోని విద్యార్థులకు దాతల సహకారంతో స్టీల్ గ్లాసులు, కంచాలను అందజేశారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కోటిపల్లి సాయిపార్థసారధి, స్కూల్ హెచ్‌ఎం మణి రాజు, పీఈటీ ప్రసన్న, కొడపల్లి నాగరాజు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందన



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీలో నిర్వహించిన వాలీబాల్, బాస్కెట్ బాల్ పోటీల్లో భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులు నాలుగో స్థానంలో నిలిచారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు అన్నారు. విజేతలను సోమవారం కళాశాలలో అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 6 నుంచి మూడు రోజులపాటు విజ్ఞాన్ మహోత్సవ టెక్ ఫెస్ట్‌లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని తెలిపారు. విజేతలను ప్రిన్సిపాల్ ఎం వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎం శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు అభినందించారు.

### పెదఅమిరంలో అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సోమేశ్వరరావు

కాళ్ల: మండలంలోని పెదఅమిరం గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో చర్చి వీధిని సుమారు రూ.10 లక్షలతో సీసీ రోడ్డుగా నిర్మిస్తున్నామన్నారు. పనులు నాణ్యత విషయంలో రాజీ పడకుండా చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో ఎక్కడా మురుగునీరు నిలవకుండా పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు తెలిపారు. ఈయన వెంట పలువురు వార్డు సభ్యులు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గృహాలకు సౌర కాంతులు

- సూర్యఘర్‌తో నిరంతర వెలుగులు
- సబ్సిడీలతో ముందుకు వస్తున్న వినియోగదారులు
- కరెంట్ సమస్యలకు చెక్
- ఉండి నియోజకవర్గంలో 115 ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు
- నియోజకవర్గంలో మొత్తం 1308 మంది దరఖాస్తుదారులు



గృహంపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్యానల్స్

ఆకివీడు: సౌర కాంతులతో గృహాలు శోభిల్లుతున్నాయి. నిరంతరం విద్యుత్ సరఫరాతో ఆయా గృహాల్లోని వినియోగదారులు ఆనందంతో జీవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజలీ యోజన పథకం అమలు చేయడంతో వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడనవసరం లేకుండా గృహ అవసరాలకు సరిపడే విద్యుత్‌ను వినియోగించుకుని, మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం తీసుకోవడంతో తమకు అన్ని విధాలుగా మేలు జరిగే అవకాశం ఉందని లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు. పథకం కోసం నియోజకవర్గంలోని 1308 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకూ 115 మంది ఇళ్లపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు.

**విస్తృత ప్రచారం**

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్ బిజలీ యోజన పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు అన్ని మండల కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారుల్లో అవగాహన పెంచేందుకు, విద్యుత్ పొదుపు, ఉత్పత్తి, వినియోగంపై పథకం వల్ల వచ్చే లాభాలను వివరిస్తున్నారు. లోఓల్టేజ్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. వినియోగదారుడు పెట్టే పెట్టుబడి తిరిగి వచ్చే మార్గం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. భవనం పైభాగంలో గాని, మరెక్కడైనా వంద చదరపు అడుగుల స్థలం ఉంటే సరిపోతుంది. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదిస్తే పథకం అమలుకు అన్ని ఏర్పాట్లు చేస్తారు.

### సోలార్ విద్యుత్ ఉత్పత్తి బాగుంది



సోలార్ ప్యానల్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి బాగుంది. సోలార్ విద్యుత్ నేరుగా గ్రిడ్‌కు వెళిపోతుంది. మనం వాడుకున్న లోడుకు సంబంధించి బిల్లు వస్తుంది. నిరంతరం విద్యుత్ సరఫరా పొందుతున్నాం. లోఓల్టేజ్ సమస్య లేదు. కరెంట్ కట్ సమస్య లేకుండా ఉంది. ఏ విధమైన ఇబ్బందులు లేకుండా మంచి కరెంట్ లభిస్తుంది.

–గొంట్ల సత్యనారాయణ, గ్రామస్తుడు, ఆకివీడు

### మంచి అవకాశం



సూర్యఘర్ పథకం వినియోగదారులకు మంచి అవకాశం. దరఖాస్తు చేసుకున్న వినియోగదారులు సంబంధిత లోడుకు సంబంధించి ఫీజు చెల్లించిన వెంటనే వెండర్లు ప్యానల్స్ ఏర్పాటు పనులు చేపడతారు. కిలో వాట్స్‌ను బట్టి సబ్సిడీ మంజూరు అవుతుంది.

–యు.శ్రీనివాసరావు, ఏడీ, ట్రాన్స్‌కో, ఆకివీడు

### రూఫ్‌టాప్ సామర్థ్యం ఇలా

- ఒక కిలో వాట్‌కు నెలకు 120 యూనిట్లు వినియోగిస్తే ఏడాదికి రూ.8 వేలు ఆదా అవుతుంది. ప్రభుత్వ రాయితీ రూ.30 వేలు లభిస్తుంది.
- రెండు కిలో వాట్ల సామర్థ్యానికి 240 యూనిట్లుకు రూ.20 వేలు ఆదా కాగా, ప్రభుత్వం నుంచి రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది.
- 3 కిలో వాట్ల సామర్థ్యానికి 360 యూనిట్లకు రూ.32,400 ఆదా కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.78 వేలు లభిస్తుంది.

**కిలోవాట్లను బట్టి సబ్సిడీ, రిజిస్ట్రేషన్ ఫీజు**

- ఐదు కిలో వాట్స్‌కు రూ.1900, ఐదు కిలో వాట్స్ పైబడిన వాటికి రూ.5,900 చెల్లించాలి. 10 కిలో వాట్స్ పైబడిన హెచ్‌టీ సర్వీసులకు రూ.11,800 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి.
- లబ్ధిదారులు చెల్లించిన సొమ్ము మినహా మిగిలినది బ్యాంక్ రుణం, వాయిదాలపై చెల్లింపు.
- 3 కిలో వాట్స్ లోపు సర్వీసులకు సర్వీసు ఫీజు లేదు.

### నియోజకవర్గంలో సూర్యఘర్ పథకం వివరాలు

| సెక్షన్ | రిజిస్ట్రేషన్ | ఫీజు చెల్లించినవి | లోడు |
|---|---|---|---|
| ఆకివీడు | 165 | 33 | 107 |
| గుమ్ములూరు | 182 | 19 | 58 |
| కాళ్ళ | 127 | 26 | 87 |
| ఉండి | 664 | 28 | 72.96 |
| పాలకోడేరు | 170 | 09 | 27 |

### రామలింగేశ్వరుడికి క్షీరాధివాసం



విగ్రహాలకు క్షీరాధివాసం చేస్తున్న భక్తులు

ఆకివీడు: మండలంలోని సిద్ధాపురంలో నూతనంగా నిర్మించిన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం రెండో రోజు సోమవారం కొనసాగించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో విఘ్నేశ్వర పూజ, కలిస పూజలతో పాటు, వాస్తు బలిహరణ, వాస్తు హోమం, పరియాగ్రీకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠకు తీసుకొచ్చిన నూతన విగ్రహాలకు క్షీరాధివాసం చేశారు. ధ్వజ స్థంభానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త భూపతిరాజు తిమ్మరాజు, పృథ్వీకుమారి దంపతుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### టెక్నాలజీ అధ్యయనంతోనే ఇన్నోవేషన్ సాధ్యం



కళాశాలలో మాట్లాడుతున్న సాయిపవన్

భీమవరం: టెక్నాలజీ అధ్యయనంతోనే ఇన్నోవేషన్ సాధ్యమని సాఫ్ట్‌వేర్ శిక్షణా సంస్థ బ్రెయినో విజన్ సొల్యూషన్ ఎంటర్ ప్రెన్యూర్ వి.సాయి పవన్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో మూడు రోజుల జాతీయస్థాయిలో డెవాప్స్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టెక్నికల్ స్టూడెంట్ కెరీర్ గ్రోత్ పెంచుకోవాలంటే టెక్నాలజికల్ ఏఫెసెన్సీ బాగా వృద్ధి చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో మూడో ఏట నుంచి విద్యార్థులకు నూతన టెక్నాలజీని అందించటమే కాకుండా, వాటిపై హేక్తాన్ కూడా నిర్వహించడం వల్ల విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఐటీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఐ.హేమలత మాట్లాడుతూ మూడు రోజుల వర్క్‌షాప్ అనంతరం 24 గంటల హేక్తాన్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పి.రవికిరణ్, కె.కిషోర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# బయటి ఆహార పదార్థాలు తినొద్దు

జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి



భీమవరం : పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో మాత్రలు వేసుకుంటున్న విద్యార్థినులు



ఆకివీడు: పిల్లలకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం: విద్యార్థులు బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు మునిసిపల్ (పీఎస్‌ఎమ్) గరల్స్ హైస్కూల్లో సోమవారం నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇష్టపడి చదవడం వల్ల మంచి ఫలితాలు సాధించగలరని అన్నారు. ఏ సబ్జెక్ట్ అయినా ఎక్కువసార్లు చదివితే పూర్తిగా అర్థం తెలుస్తుందని తద్వారా గుర్తుండిపోతుందని వివరించారు. పరీక్షలు అంటే భయాన్ని విడనాడాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ ఇ.నారాయణ, డీఎంహెచ్ఓ బి.భాను నాయక్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుజాతరాణి, ఆర్‌బీఎస్‌కే పీఓ సీహెచ్ భావన, మధ్యాహ్నభోజన పథకం కోఆర్డినేటర్ కె.కృష్ణారావు, హెచ్‌ఎం వారణాసి రాధ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నులి పురుగులను నులిమేద్దాం**

భీమవరం అర్బన్: నులి పురుగులను అల్బెండజోల్ మాత్రల ద్వారా నిర్మూలిద్దామని వైద్యాధికారిని ఎ.అరుణరాణి అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణరాణి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఉన్న 14,300 విద్యార్థుల్లో 13,325 మందికి అల్బెండజోల్ మాత్రలు ఇచ్చామన్నారు. అనంతరం చేతులు, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కె.అప్పారావు, సూపర్ వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**ఆరోగ్యాన్ని నులిమేస్తుంది**

ఆకివీడు: నులి పురుగులతో అనారోగ్యం పాలవుతామని మండలంలోని పెదకాపవరం గ్రామం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రమేష్, బి.రాజశేఖర్ అన్నారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో నులిపురుగుల నివారణ మాత్రలను చిన్న పిల్లలకు వేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 సచివాలయాలు, 46 అంగన్‌వాడీ కేంద్రాలు, 38 ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, 7 ప్రైవేట్ పాఠశాలలు కలిపి మొత్తం 91 పాఠశాలల్లో 5,800 మంది పిల్లలకు గానూ 5649 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశామని చెప్పారు. కార్యక్రమాల్లో హెల్త్ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశల పాల్గొన్నారని తెలిపారు.

**నులిపురుగులతో రక్తహీనత**

కాళ్ల: నులిపురుగులతో పిల్లలు రక్తహీనతకు గురవుతారని కాళ్ల మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ తెలిపారు. ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలన్నింటిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి మాత్రలను పిల్లలు మింగడం ద్వారా రక్తహీనత నుంచి కాపాడొచ్చన్నారు. ఎవరైనా పిల్లలు కొన్ని అనివార్య కారణాల వలన వేసుకోకపోతే మరలా 17వ తేదీన క్యాంపు నిర్వహించి అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ డి.సునీత, డాక్టర్ టి.భావన, సిబ్బంది పాల్గొన్నారు.

**నులిపురుగును నులిమేద్దాం**

ఉండి: నులిపురుగులను నివారించకపోతే మనిషి ఎదుగుదలపై అది ఎంతో ప్రభావం చూపిస్తుందని యండగండి ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ బెన్నీ సామ్యూల్, డాక్టర్ ఐసీ కీర్తన అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని యండగండి, ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్‌బెండజోల్ మాత్రలను విద్యార్థులకు అందజేసి మింగించారు. యండగండి పీహెచ్‌సీ పరిధిలో 5658 మందికిగాను 5484 మందికి మాత్రలు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి 17వ తేదీన అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎం రత్నరాజు,కేఎస్ఎస్ శ్రీనివాస్,కే దీనకుమారీ తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి భోజనం చేసే ముందు, చేసిన తర్వాత, కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత, బయటకు వెళ్లినప్పుడు, వచ్చినప్పుడు చేతులను, కాళ్లను శుభ్రంగా కడుక్కోవడం వలన మంచి ఆరోగ్యాన్ని పొందొచ్చని జిల్లా వ్యాధి నిరోధక శాఖ అధికారి దేవసుధ అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మరొక వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ, పీహెచ్ఎస్ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఐదో రోజుకు కార్మికుల రిలే దీక్ష



దీక్ష చేస్తున్న కార్మికులు

భీమవరం(ప్రకాశం చౌక్) : ఆర్టీసీ స్థానిక డిపో గ్యారేజి మెకానిక్ యూవీ రావుకు న్యాయం చేయాలని యూనియన్ నాయకులు, కార్మికులు డిపో వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఐదో రోజు సోమవారం కూడా కొనసాగింది. డీపీటీఓ యూనియన్ నాయకులు, ఉద్యోగుల ఆయనతో చర్చించారు. మెకానిక్‌కు మరో డిపోకు బదిలీ చేస్తామని ఆయన చెప్పగా అందుకు ఉద్యోగులు నిరాకరించారు. నాయకులు, ఉద్యోగులు మాట్లాడుతూ భీమవరం ఆర్టీసీ డిపో గ్యారేజి మెకానిక్ యూవీ రావును డిపో మేనేజర్ అక్రమంగా సస్పెండ్ చేశారని, న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సతీష్‌బాబు, కె.రామరావు, వైవీ రావు, ఎ.నాగేశ్వరరావు, పి.సోమరాజు, ఎం నాగబాబు, రమేష్‌బాబు, కె.నందు తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారులకు అవగాహన సదస్సు

నరసాపురం రూరల్: సముద్ర తాబేళ్లను సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు ఎల్ఎల్ఎన్ రాజు అన్నారు. సోమవారం నరసాపురం మండ లం చినమైనవానిలంకలో సముద్రపు ఒడ్డున మత్స్యకారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సముద్రపు ఒడ్డుకు తాబేళ్ల మృత కళేబరాలు కొట్టుకొస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సముద్రపు వేటకు వెళ్లే మత్స్యకారులు ఎవరైనా తాబేళ్లను పట్టుకోవడం లేదా చంపడం వంటి పనులకు పూనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేడీ వెంకటేశ్వర్లు

ఆకివీడు: రైతులు తప్పనిసరిగా యూనిక్ ఐడీని పొందాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని అజ్జమూరు, కుప్పనపూడి, గుమ్ములూరు, చినకాపవరం, చెరుకుమిల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఈ–క్రాఫ్ నమోదును పరిశీలించారు. అనంతరం కుప్పనపూడి గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద ఈ–క్రాప్ నమోదు రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా ఐడీ పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఆధార్ అనుసంధానమైన మొబైల్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకంతో గ్రామంలోని రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. యూనిక్ ఐడీ పొందితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రియాంక, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

**యూనిక్ ఐడీని నమోదు చేసుకోవాలి**

భీమవరం అర్బన్: వ్యవసాయ రంగం పూర్తి ఆధునీకరణ (డిజిటలైజేషన్)కు కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్ తరహాలో 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ కోడ్) కార్డును అందించనున్నట్టు మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలు, పథకాలు పొందేందుకు యూనిక్ కోడ్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు. సొంత భూమి గల రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, 1–బి, ఆధార్ కార్డు, ఆధార్ నెంబర్‌కు లింకైన ఫోన్ తీసుకుని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలని కోరారు.

# దళితులపై దాడులను సహించం



ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

భీమవరం: దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, ఎఫ్ఎఫ్ఎస్‌సీఐ జిల్లా ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు స్టాన్లీ తోమస్, ఏపీసీపీఏ ఫౌండర్ ఎండీ ఇస్మాయిల్ అన్నారు. ఉండి మండలం వాండ్రం గ్రామానికి చెందిన దళిత నాయకుడు మత్తే రాజ్‌కుమార్‌పై దాడిని ఖండిస్తూ సోమవారం భీమవరం ప్రభుత్వాసుపత్రి వద్ద దళిత నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వాండ్రంలోని ఆక్వాచెరువు వద్ద పనులు చేసుకుంటున్న రాజ్‌కుమార్‌పై కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని, దాడిచేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలన్నారు. తొలుత ఆసుపత్రిలో రాజ్‌కుమార్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఎ.మోరియా, జి.దానియేలు, గుర్రం జాషువా, కె.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

భీమవరం: రక్తదానం ప్రాణ దానంతో సమానమని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు అన్నారు. సోమవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సాగి రామకృష్ణంరాజు పేరిట రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్, ధరణి బ్లడ్ బ్యాంక్ 150 యూనిట్స్ రక్తాన్ని సేకరించారు. ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణమరాజు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కేఎస్‌వీ సత్యనారాయణ, ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పి.రవికిరణ్ వర్మ పాల్గొన్నారు.

# ఘనంగా పెనూయేలు సువార్త సభలు



సువార్త సభలో ఏసు కీర్తనలు ఆలపిస్తున్న బృందం

ఉండి: ప్రతి ఏటా ఉండిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పెనూయేలు ప్రేయర్ మినిస్ట్రీస్ ఏసుక్రీస్తు సువార్త మహాసభలు ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించారు. ఉండి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్టీఆర్ ఎస్టేట్స్‌లో ఈ నెల ఎనిమిది నుంచి పదో తేదీ వరకు వరకు నిర్వహించిన మహాసభలకు వేలాది మంది విశ్వాసులు హాజరై ప్రార్థనలు చేశారు. ఈ సభల్లో పాస్టర్ జార్జ్‌బుష్ (ఉయ్యూరు), బ్రదర్ మాథ్యూస్(గుంటూరు), పాస్టర్ జెఫన్యాశాస్త్రి(విశాఖపట్నం) వాక్యోపదేశకులుగా హాజరయ్యారు. రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి బ్రదర్ జాన్సన్ మేడిద ముఖ్య అతిథిగా విచ్చేశారు. పెనూయేలు ప్రెయర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ ఈది విజయ ప్రసాద్, ఆత్మీయతల్లి దాయం సునీత ఆధ్వర్యంలో మూడురోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించిన సభల్లో జోనా టీమ్ అందించిన ప్రత్యేక సంగీతం ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో పెనూయేలు ప్రేయర్ మినిస్ట్రీస్ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

### ఉపకార వేతనాల పంపిణీ

పాలకొల్లు అర్బన్: సేవాతత్వానికి నిలువెత్తు నిదర్శ నం తులసీ సీడ్స్ అధినేత తులసీరామచంద్రప్రభు అని పలువురు వక్తలు ప్రశంసించారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో సోమవారం రాత్రి నియోజకవర్గ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల కు చెందిన 329 మంది విద్యార్థులకు రూ.12.90 లక్షల ఉపకార వేతనాలను రామచంద్రప్రభు ప్రోత్సాహంతో అందజేశారు. డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి), చవ్వాకుల ట్రస్ట్ అధినేత చవ్వాకుల సూర్య నరేష్‌బాబు, యర్రంశెట్టి వెంకటరత్నం, డా.ముచ్చర్ల సంజయ్, డా.వంగా శేషు, కొమ్ముల మురళీకృష్ణ, మండెల రజనీ, గంటా శ్రీనివాస్, దాసరి లక్ష్మీనారాయణ, పెనుమాక రామమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.